ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



విశాఖ డైరీ అవినీతి విచారణకు ప్రత్యేక హౌస్ కమిటీ

- చైర్మన్‌గా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విశాఖ డైరీ అవినీతి విచారణకు ప్రత్యేక హౌస్ కమిటీని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి చైర్మన్‌గా జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూను నియమించగా కమిటీ సభ్యులుగా కొందరు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ కమిటీ విచారణ నివేదికను నెలరోజుల్లోగా సమర్పించాల్సి ఉంది.

నిలదీసి.. నిగ్గదీసి..



బియ్యం నమూనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్, మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే కొండబాబు

- కాకినాడ పోర్టులో రేషన్ మాఫియాపై పవన్ శివాలు
- యథేచ్ఛగా బియ్యం తరలిపోతుంటే అంతా ఏం చేస్తున్నారంటూ నిప్పులు
- డీఎస్‌వో, కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ, పోర్టు అధికారులపై తీవ్ర ఆగ్రహం
- తానొచ్చినప్పుడల్లా జిల్లా ఎస్పీ సెలవుపై వెళ్లడమేంటని మండిపాటు
- ప్రతిసారి ఎమ్మెల్యేలు, మంత్రులు వస్తే గానీ బియ్యం అక్రమ రవాణా ఆగదా అని నిప్పులు
- పవన్ ప్రశ్నలు, నిలదీతలతో హడలిపోయిన అధికారులు.. బియ్యం మాఫియాకు షాక్
- అటు సముద్రం అల్లకల్లోలంగా ఉన్నా సాహసించి తొమ్మిది నాటికల్ మైళ్ల ప్రయాణం
- రెండు నెలలుగా తనను తనిఖీలకు రాకుండా అడ్డుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు
- పశ్చిమ ఆఫ్రికాకు వెళ్లే నౌకను సీజ్ చేయాలని ఆదేశాలు : ఎస్పీకి నోటీసులు

మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్. పక్కన మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే కొండబాబు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్



(కాకినాడ/కలెక్టరేట్ - ఆంధ్రజ్యోతి)

కాకినాడ నుంచి యథేచ్ఛగా రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోతున్న వైనంపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అధికారులు పద్ధతి మార్చుకోకుండా మాఫియాకు సహకరిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోయేలా అధికారులే సహకరిస్తున్నారంటూ శివాలెత్తారు. డీఎస్‌వో, కలెక్టర్, పోర్టు అధికారులను పిలిచి ఏం చేస్తున్నారు మీరంతా అంటూ మండిపడ్డారు. కాకినాడ జిల్లా ఎస్పీకి ఎన్నిసార్లు చెప్పినా కనీసం స్పందన లేదని దునుమాడారు. తాను జిల్లాకు ఎప్పుడు వచ్చినా సెలవుపై ఉంటున్నారు.. అంటూ ఆయనకు నోటీసులు పంపాలని ఆదేశించారు. కాకినాడ పోర్టు ప్రమాదకరంగా మారిందని, దీనిపై ప్రధాని, కేంద్ర హోంమంత్రికి లేఖ రాస్తానని హెచ్చరించారు.

యాంకరేజ్ పోర్టులో బియ్యం పరిశీలన

కాకినాడ పోర్టులో పవన్‌కళ్యాణ్ శుక్రవారం మధ్యాహ్నం పర్యటించారు. తొలుత 12.45గంటలకు యాంకరేజ్ పోర్టులో బార్జిలో తనిఖీలు చేశారు. ఇందులో రేషన్ బియ్యం ఎగుమతి అవుతుండడంతో ఇటీవల అధికారులు పట్టుకున్నారు. నేరుగా పవన్ బార్జి ఎక్కి బియ్యం ప్లేటులో వేసి పరిశీలించారు. రేషన్ బియ్యం ఆనవాళ్లను గుర్తించారు. అక్కడే ఉన్న డీఎస్‌వో, కలెక్టర్, పోర్టు అధికారి, ఇతర అధికారులపై తీవ్రంగా మండిపడ్డారు. రేషన్ మాఫియాకు మీరంతా సహకరించకపోతే ఇలా ఎలా దేశాలు దాటిపోతోందని శివాలెత్తారు. ఉద్యోగాలు చేస్తున్నారా.. మాఫియాకు వంత పాడుతున్నారా? అంటూ మండిపడ్డారు. పక్కనే ఉన్న టీడీపీ ఎమ్మెల్యే కొండబాబును ఉద్దేశించి దీనిపై మరింత గట్టి పోరాటం చేయాలని, నెమ్మదిగా ఉండకూడదని పేర్కొన్నారు. అనంతరం అక్కడినుంచి మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత డీప్‌వాటర్ పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి టగ్ ఎక్కి సముద్రంలోకి వెళ్లారు.

సముద్రం అల్లకల్లోలంగా ఉన్నా..

తుఫాను నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో పవన్ సముద్రంలోకి వెళ్తారని అధికారులు అనుకోలేదు. కానీ అనూహ్యంగా ఆయన టగ్ ఎక్కి తొమ్మిది నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న పశ్చిమ ఆఫ్రికా నౌక స్టెల్లా ఎల్ పనామా వద్దకు బయలుదేరారు. సముద్రం భయానకంగా ఉండడంతో అధికారులు వద్దని వారించారు. అయినా పవన్ వినలేదు. నౌకవద్దకు వెళ్లిన తర్వాత పైకి ఎక్కి ఎగుమతికి సిద్ధంగా ఉన్న 640 టన్నుల బియ్యాన్ని పరిశీలించాలి. కానీ వాతావరణం బాగోలేదని, నౌకపైకి ఎక్కొద్దని అధికారులు పవన్‌కు తెలిపారు. సముద్ర ప్రయాణం మధ్యలో పవన్ ఎమ్మెల్యే కొండబాబు సమక్షంలో అధికారులపై మండిపడ్డారు. రేషన్ మాఫియాపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అసహనం వ్యక్తంచేశారు. ఈ విషయంలో మొత్తం సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్ ఫెయిల్ అయ్యిందన్నారు. డీఎస్‌ఓ ప్రసాద్, జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, పోర్టు అధికారి ధర్మ శాస్త్ర, డీఎస్పీ రఘువీర్‌పై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పీడీఎస్ బియ్యం ఉన్న స్టెల్లా ఎల్ పనామా భారీ నౌకను సీజ్ చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆదేశించారు. కాకినాడ యాం కరేజ్ పోర్టులో అధికారులు దృష్టిపెట్టాల న్నారు. పోర్టులోని రెండు చెక్‌పోస్టుల వద్ద 24 గంటలు నిఘా ఉండాలన్నారు.

కాకినాడలో రేషన్ మాఫియా

మధ్యాహ్నం 3 గంటల తర్వాత తిరిగి డీప్‌వాటర్ పోర్టుకు చేరుకున్న పవన్ విలేక రుల సమావేశంలో ప్రసంగించారు. రేషన్ మాఫియా కాకినాడలో దారుణంగా ఉందని, తనను నౌక ఎక్కనీయకుండా అధికారులు అడ్డు కున్నారని పేర్కొని సంచలన వ్యాఖ్యలు చేశా రు. రెండు నెలలుగా కాకినాడ పోర్టులో తనిఖీలకు తనను రాకుండా అధికారులు ఏవో సాకులు చెప్పి అడ్డుకుంటున్నారని గుర్తుచేసి బాంబు పేల్చారు. తాను ఢిల్లీ నుంచి అమరావతి వెళ్లాలని, కానీ రేష న్ మాఫియా తీవ్రత నేపథ్యంలో కాకి నాడ పర్యటనకు వచ్చానని తెలిపారు. విలేకరుల సమావేశం అనంతరం పవన్ అమరావతికి బయలుదేరి వెళ్లారు.

గ్రీన్‌ఛానల్ ద్వారా తరలింపు

అంతకుముందు మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గత జూన్‌లో కాకినాడలో తనిఖీ చేసి నప్పుడు 26వేల మెట్రిక్ టన్నులు పీడీఎస్ బియ్యం పట్టుకున్నామన్నారు. బియ్యం మాఫియా గుంటూ రు, చిత్తూరు, శ్రీకాకుళం జిల్లా నుంచి గ్రీన్ ఛానల్ ఏర్పాటుచేసుకుని కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు అక్రమంగా తరలిస్తున్నారన్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ద్వారంపూడి వ్యాపారం చేశారనీ, ఇప్పుడు బినా మీలు ఈ దందా చేస్తున్నారని ఆరోపించారు.



బియ్యం పరిశీలిస్తూ..



డీఎస్పీ రఘువీర్‌ని ప్రశ్నిస్తున్న పవన్

తుఫాన్ ఎఫెక్ట్.. తీరంలోనే బోట్లు



తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారులు ఆదేశించడంతో కాకినాడ కుంభాభిషేకం రేవు వద్ద ఒడ్డుకు చేరుకున్న బోట్లు


చీటింగ్ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

కాకినాడ క్రైం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఓ చీటింగ్ కేసులో నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో కాకినాడ మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.శ్రీదేవి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలివి. కాకినాడ జగన్నాథపురం రెల్లిపేటకు చెందిన పొట్నూరి నాని సూర్య స్థానిక నాగరాజుపేటకు చెందిన సాంబశివరావ్ అనే వ్యక్తికి జేఎన్‌టీయూకేలో కాంట్రాక్ట్ పద్ధతిలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2.50 లక్షలు ఖర్చవుతుందని చెప్పాడు. దీంతో సాంబశివరావ్ ముందుగా నానిసూర్యకి రూ.80వేలు ఇచ్చాడు. అనంతరం ఉద్యోగం ఇప్పించకుండా నాని సూర్య తప్పించుకుని తిరుగుతుండడంతో బాధితుడు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. అనంతరం దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. వాదోపవాదనల అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ కె.సుధారాణి వాదనలు వినిపించారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు

కాకినాడ క్రైం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో కాకినాడ మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.శ్రీదేవి ఒక ఏడాది జైలుశిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు.కోనసీమజిల్లా జనుపల్లికి చెందిన 45ఏళ్ల ఈత కోట శ్రీనుబాబు అలియాస్ పండు ఈ ఏడాది ఆగస్టులో కాకినాడ జె.రామారావుపేటలో ఒక ఇంట్లో నాలుగు గ్రాముల బంగారం, సెప్టెంబరులో స్థానిక జీజీహెచ్ అత్యవసర విభాగంవద్ద నిలిపి ఉన్న బైక్‌ను చోరీచేశాడు. అనంతరం దర్యాప్తు చేపట్టిన వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా అతడికి కోర్టు రిమాండ్ విధించింది. అనంతరం జరిగిన వాదోపవాదనల్లో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ కె.సుధారాణి వ్యవహరించారు. వన్‌టౌన్ సీఐ నాగదుర్గారావు బృందం వారికి సహకరించింది.

నిశీధిలో.. జీవనయాత్ర!



కాకినాడ నగరం.. నైట్ విజిట్

- నగరం నిద్రపోయే వేళ వీరి దినచర్య మొదలు.. రాత్రంతా చెమటోడ్చే శ్రమజీవులు

6

జిల్లాకు డిప్యూటీ కలెక్టర్లు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాకు కొత్తగా ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లను వివిధస్థానాల్లో నియమించింది. కాకినాడ ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా డి.పెద్దిరాజును నియమించింది. అన్నవరం దేవస్థానంఈవోగా వి.సుబ్బారావును నియమించారు. కాకినాడ సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా పి.వేణుగోపాలరావును ప్రభుత్వం నియమించింది.

డీఎస్‌వోపై వేటు

- పౌరసరఫరాల శాఖ కమిషరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశం
- మామూళ్లతో 'చెక్' కథనంతో అధికార యంత్రాంగంలో కదలిక
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిపై వేటుపడింది. కాకినాడ పోర్టులో బియ్యం తనిఖీ చేసే చెక్‌పోస్టుల్లో అక్రమాలు జరుగుతున్నాయని ఆంధ్రజ్యోతిలో శుక్రవారం కథనం ప్రచురితమైంది. పోర్టువద్ద చెక్‌పోస్టుల్లో విధుల్లో ఉన్న ఉద్యోగులు సొమ్ములు తీసుకుని పీడీఎస్ బియ్యం రవాణాకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారని అందులోని సారాంశం. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు డీఎస్‌వోను సెలవులోకి పంపించారు. శుక్రవారం అకస్మాత్తుగా డిప్యూటీ సీఎం పవన్ కూడా పోర్టుకు రావడం.. ఆయన అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో డీఎస్‌వోను పౌరసరఫరాలశాఖ కమిషనరేట్‌లో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు వెలువడ్డాయి. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జిడీఎస్‌వోగా ఏఎస్‌వో ప్రసన్నలక్ష్మీదేవికి బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో మిగిలినఅధికారుల్లోను వణుకు మొదలైంది.

చెక్‌పోస్టుల్లో కలెక్టర్ తనిఖీలు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కాకినాడ యాంకరేజ్ పోర్టులో ఉన్న రెండు చెక్‌పోస్టులను జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ శుక్రవారం తనిఖీలు చేశారు. ప్రధానంగా బొంబాయి కాటా వద్ద చెక్‌పోస్టు, శక్తిగ్యాస్ సెంటర్ వద్ద ఉన్న చెక్ పోస్టులను తనిఖీ చేశారు. బియ్యం లోడ్‌తో వస్తున్న లారీల్లో బియ్యం శాంపిల్స్ ఎలా తీస్తున్నారని ఉద్యోగులను ప్రశ్నించారు. పీడీఎస్ బియ్యాన్ని ఎలా గుర్తిస్తున్నారని ఆరా తీశారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి పత్రికలో మామూళ్లతో చెక్ అనే కథనం ప్రచురించింది. దీంతో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ రెండు చెక్‌పోస్టుల్లో విస్తృత తనిఖీలు చేశారు. సొమ్ములు తీసుకుని పీడీఎస్ బియ్యం వదిలేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రక్షాళన దిశగా..

- రిజిస్ట్రేషన్‌శాఖలో సమూల మార్పులు
- గత ప్రభుత్వం హయాంలో అస్తవ్యస్తం
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు పూర్వవైభవం తెచ్చేలా చర్యలు



పెద్దాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖను భ్రష్టు పట్టించింది. అనాలోచిత నిర్ణయాలతో అస్తవ్యస్తం చేసింది. ఇష్టానుసారం సాఫ్ట్‌వేర్ మార్చేసింది. కార్డు ప్రైమ్ 2.0 విధానం అమలు చేసింది. సర్వర్ నిర్వహణ బాధ్యతలను ఓ సంస్థకు అప్పగించింది. నిర్వహణ అధ్వానంగా మారి నిత్యం సర్వర్ సమస్యలు తలెత్తాయి. రిజిస్ట్రేషన్లకు జనం రోజుల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. నాన్ జ్యుడిషియల్ పత్రాల స్థానంలో ఈ-స్టాంపింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. జనం నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైనా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వ్యవస్థను మొత్తం ప్రక్షాళన చేస్తోంది. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖకు పూర్వవైభవం తెచ్చేలా చర్యలు తీసుకుంది.

అందుబాటులో ఈసీలు..

ఇదివరకు ఎంకంబరెన్స్ సర్టిఫికెట్ కాపీల కోసం జనం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. దీనికోసం ఆమ్యామ్యాలు ఇవ్వాల్సి వచ్చేది. పది నిమిషాల్లో తీసుకోవాల్సిన ఈసీ కోసం ఒకరోజు సమయం పట్టేది. మధ్యవర్తుల జోక్యం అధికంగా ఉండేది. ఇకనుంచి ఈసీలు, సీసీలను నేరుగా ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కూటమి ప్రభుత్వం కల్పించింది.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లకు చెల్లుచీటి

గత వైసీపీ ప్రభుత్వం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లకు శ్రీకారం చుట్టింది. సచివాలయ కార్యదర్శులకు అరకొర శిక్షణ ఇచ్చి జాయింట్ సబ్‌రిజిస్ట్రార్లుగా గుర్తింపు ఇచ్చింది. కొన్ని గ్రామ, వార్డు సచివాలయాలను జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలుగా మార్చింది. జిల్లాలోని అరకొరగా రిజిస్ట్రేషన్లు జరగ్గా అందులో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలం ఇళ్ల పట్టాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్‌లు అందులోనే జరిగాయి. ఈ విధానంతో కొంత గందరగోళం నెలకొంది. కొత్త ప్రభుత్వం రాకతో ఈ విధానం పూర్తిగా రద్దయ్యింది. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయడం ప్రజలకు ఎంతో ఊరటనిచ్చింది.

ఈ-స్టాంపింగ్ రద్దుతో ఉపశమనం

కొన్నిదశాబ్దాలుగా నాసిక్‌నుంచి తెప్పించే నాన్ జ్యుడీషియల్ స్టాంపు పత్రాలను ప్రజలు రిజిస్ట్రేషన్, అఫిడవిట్ ఇతర వ్యవహారాలకు ఉపయోగించేవారు. వైసీపీ ప్రభుత్వం నాన్ జ్యుడీషియల్ స్టాంపులు తెప్పించలేక ఈ-స్టాంపింగ్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. నాసిరకం పేపర్లపై ముద్రించి ఇవ్వడాన్ని జనం వ్యతిరేకించారు. అయినా అప్పటి ప్రభుత్వం ఖాతరు చేయలేదు. దీన్నే కొనసాగించడం ప్రజలు న్యాయస్థానాన్ని ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. ప్రస్తుత ప్రభుత్వం మొదటిగా ఈ-స్టాంపింగ్ విధానాన్ని రద్దు చేసి తిరిగి నాన్‌జ్యుడీషియల్ స్టాంపులను తీసుకువచ్చింది.

ఇష్టానుసారం విలువలను పెంచి..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ రంగం క్షీణించడంతో ఆదాయం బాగా తగ్గుముఖం పట్టింది. దీంతో ఆదాయం పెంచుకునేందుకు గత వైసీపీ ప్రభుత్వం భూములు, భవనాల విలువలను అమాంతం పెంచేసింది. బహిరంగ మార్కెట్ కంటే రెండు, మూడు రెట్లు మేర విలువలు పెంచింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ లోపాలను గుర్తించి సవరించేందుకు సన్నాహాలు చేస్తోంది.

రాచరికపు పోకడలకు స్వస్తి..

జడ్జీల తరహాలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్‌రిజిస్ట్రార్లు ఎత్తైన పోడియంపై కూర్చునేవారు. బ్రిటీష్ కాలంనాటి విధానం కొనసాగేది. ఈ విధానాన్ని జనం ఇబ్బందికరంగా భావించేవారు. సబ్ రిజిస్ట్రార్ కూర్చునే సీటింగ్ ఎత్తును పూర్తిగా తగ్గించాలని ఈ ఏడాది సెప్టెంబరులో ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. త్వరలో మరికొన్ని విధానాల్లో మార్పులకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రజలకు ఉత్తమ సేవలను అందించే దిశగా అడుగులు వేస్తోంది.

ఆధార్ ఉంటేనే స్టాంపులు

నాన్‌జ్యుడీషియల్ స్టాంపులు కావాలంటే గతంలో ఒక ఫారంలో పేరు, డినామినేషన్, చిరునామా తదితర వివరాలు నమోదు చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇస్తే స్టాంపులు ఇచ్చేవారు. ప్రత్యేక స్టాంపు వెండర్ల ద్వారా కూడా వీటిని అమ్ముతుండేవారు. కొందరు వెండర్లు ఎక్కువ సంఖ్యలో స్టాంపులు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించేవారన్న విమర్శలు వచ్చాయి. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం అక్రమాలకు అడ్డుకట్ట వేసింది. ఇందుకు అనుగుణంగా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ఒకటి, అంతకంటే ఎక్కువగా నాన్‌జ్యుడీషియల్ స్టాంపులు కొనుగోలు చేసినా కొత్త విధానంలో మొత్తం వివరాలు కంప్యూటర్‌లో నమోదు చేసుకోవాల్సిందే. స్టాంపులు పొందడానికి ఆధార్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. గతంలో మాదిరిగా రికార్డుల్లో రాసి స్టాంపులు ఇచ్చే విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది.



నిశీధిలో.. జీవనయాత్ర!

నగరం నిద్రపోయే వేళ వీరి దినచర్య మొదలు.. రాత్రంతా చెమటోడ్చే శ్రమజీవులు







కాకినాడ నగరం.. నైట్ విజిట్

రాత్రి 10.. 11.. 12 గంటలకల్లా అంతా ఇళ్లకు చేరిపోతారు. నిశ్చింతగా నిద్రపోతారు. అర్ధరాత్రి గాఢ నిద్రలోకి జారుకుంటారు.. కానీ, నగరం నిద్రపోతున్న వేళ.. వీరంతా మేల్కొంటారు.. నిశ్శబ్దం రాజ్యమేలుతున్న వేళ.. వీరు పనిలో నిమగ్నమై ఉంటారు.. అసలు అర్ధరాత్రి బయటి ప్రపంచం చాలామందికి తెలీదు.. అసలు రాత్రంటే చీకటేనా.. కుక్కల అరుపులు, కప్పల చప్పుళ్లు, దోమపోట్లు.. ఇవేనా? అసలు రాత్రిపూట ఏం జరుగుతోంది.. అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకు అంతా చీకటేనా..? అంటే అవును చీకటే.. అందరినీ నిద్రపుచ్చే చీకటి.. అందరికీ విశ్రాంతినిచ్చే చీకటి.. కానీ అదే చీకటి కొందరి జీవన యాత్రకు నాంది పలుకుతుంది. వారి జీవితాల్లో వెలుగులు విరజిమ్ముతోంది. వారిని నిదురకు దూరం చేసి.. మనకి నిద్రపట్టేలా చేస్తూ.. వారి బతుకు బండికి నిశీధిలో.. ఉషోదయం కలిగిస్తోంది. కాకినాడ నగరంలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఒక రాత్రంతా ఎలా ఉందో చూద్దాం.. రండి..!!














అందరూ నిద్రపోయే వేళ.. వీరు నిశాచరుల్లా సంచరిస్తారు. కానీ వీరికి ఇప్పుడే జీవన యాత్ర మొదలవుతుంది. అర్ధరాత్రి మొదలై తెల్లవారుజామున ముగిసే పనుల్లో వారంతా బిజీగా ఉంటారు. కొందరు వేకువజామున మొదలై ఉషోద సమయానికి పనులు పూర్తి చేసేస్తారు. 'ఆంధ్రజ్యోతి' అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు విజిట్ చేసింది. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు కనిపించిన దృశ్యాలను తమ కెమెరాలో బంధించింది. కాకినాడ నగరంలో నాలుగు లక్షల మంది జనాభా ఉన్నారు. వీళ్లంతా పొద్దున్న లేచేసరికి వీధులన్నీ పరిశుభ్రంగా ఉంటున్నాయంటే దానికి కారణం నగరపాలక సంస్థ పరిధిలోని నైట్ శానిటేషన్ వర్కర్స్ ఘనత.. రోజంతా వేసిన చెత్తను రాత్రివేళల్లో 52 మంది పారిశుధ్య కార్మికులు రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు ఊడుస్తున్నారు. వీళ్ల పనితీరు వల్లే నగరం ఉదయానికి పరిశుభ్రంగా.. సుందరంగా ఉంటోంది. అదేవిధంగా జిల్లా నలుమూలల నుంచి వివిధ గ్రామాల్లో పండించిన పంటలను వందలమంది రైతులు కాకినాడ పెద్ద మార్కెట్‌కు తెల్లవారుజామున రెండు, మూడు గంటల నుంచి తీసుకొస్తుంటారు. దీంతో ఆ సమయంలో పెద్ద మార్కెట్ రైతులు, వర్కర్లు, కొనుగోలుదారులతో సందడిగా ఉంది. ఇక నగరంలో ప్రధాన కూడళ్లు సర్పవరం జంక్షన్, భానుగుడి జంక్షన్, త్రీలైట్ జంక్షన్, మసీదు సెంటర్, జగన్నాథపురం వంటి ప్రాంతాల్లో ఆరోగ్య మెడికల్స్, అపోలో, కీర్తి, మెడ్‌ప్లస్ సహా మరిన్ని మెడికల్ షాపులు 24/7 సేవలందిస్తున్నాయి. రాత్రిపూట ఎవరికి అత్యవసరంగా మందులు కావాలన్నా వీటిని ఆశ్రయిస్తున్నారు. నగరంలోని గాంధీనగర్‌లో దిగువన ఉన్న నైట్ హోటల్ కాకినాడలో ఎంతో ఫేమస్. రాత్రి ఏడు గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు నగర ప్రజలకు అందుబాటులో ఉంటుంది. రాత్రి వేళల్లో ఇడ్లీ, పూరి, చపాతి, పరోట, ఉప్మా, దోసెలు అందిస్తారు. ఇలా మరికొన్ని హోటళ్లు అర్ధరాత్రి వరకు ఉంటుండగా, తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి చాలా హోటళ్లు తెరచుకుంటున్నాయి. ఇది శీతాకాలం.. చలిలో వేడివేడి టీ తాగితే ఆ మజానే వేరు. కాకినాడ భానుగుడి సెంటర్‌లో తెల్లవారుజామున మూడు గంటల నుంచి చార్మినార్ టీ సెంటర్‌లో టీ దొరుకుతుంది. ఆ సమయంలో అక్కడ ఎంతో రద్దీ కనిపిస్తుంది. రాత్రి సమయాల్లో బయటకి వచ్చి కాసేపు అలా తిరిగి ఐస్‌క్రీమ్ తినే అలవాటు కొందరికి ఉంటుంది. వీరి కోసం నగరంలోని మెయిన్‌రోడ్డు, భానుగుడి సెంటర్, జేఎన్టీయూ, ఆశ్రమ్ పబ్లిక్ స్కూల్ సెంటర్లలో అర్ధరాత్రి ఒంటి గంట వరకు ఐస్ క్రీమ్ బళ్లు అందుబాటులో ఉంటున్నాయి. చలికాలంలోనూ వీటి దగ్గర జనం కనిపించడం విశేషం. అరటిపళ్లు అమ్ముకునేవాళ్లు, స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ బాయ్స్ వంటివారు అర్ధరాత్రి 2 గంటల వరకు కనిపిస్తున్నారు. ఈ ఫుడ్ సర్వీసు కంపెనీలు అర్ధరాత్రి దాకా అధిక కమీషన్లు ఇచ్చి సర్వీస్ బాయ్‌లను అందుబాటులో ఉంచుతున్నాయి. అలాగే పెట్రోల్ బంకుల్లో కార్మికులు, ఆర్టీసీ కార్గో సేవల్లో కార్మికులు, ఆటోడ్రైవర్లు, నైట్ డ్యూటీ పెట్రోలింగ్ పోలీసులు, ఏటీఎంలతోపాటు ఆస్పత్రులు, ప్రధాన కార్యాలయాల వద్ద సెక్యూరిటీ గార్డులు కూడా రాత్రంతా మనకి తారసపడుతుంటారు.


అర్ధరాత్రి అందాల కనువిందు

ప్రజలంతా హాయిగా నిద్రపోతున్న వేళలో నగరం విద్యుత్ కాంతులతో ఎంతో ఆహ్లాదకరంగా.. అందంగా కనిపిస్తుంది. మెయిన్‌రోడ్డు, భానుగుడి జంక్షన్ నుంచి అచ్చంపేట జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపున చెట్లు, డివైడర్ మధ్యలో ఉన్న మొక్కల మధ్య విద్యుద్దీపాలు ఆకట్టుకుంటాయి. చలికాలంలో కావడంతో కొన్నిచోట్ల రాత్రిపూట, తెల్లవారుజాము సమయాల్లో చలిమంటలు కూడా కనిపిస్తున్నాయి.

- ఆంధ్రజ్యోతి/ కాకినాడ కార్పొరేషన్
ఫొటోలు/ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్











అన్నవరం నూతన ఈవోగా సుబ్బారావు

అన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యదేవుని ఆలయానికి నూతన ఈవోగా వీర్ల సుబ్బారావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం ఏపీ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దేవదాయ శాఖ అదనపు కమిషనర్‌గా ఉన్న రామచంద్రమోహన్‌ను రెండు రోజుల క్రితం ఆకస్మికంగా బదిలీ చేసి సింహాచలం ఈవో త్రినాథరావుకు అన్నవరం అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే తాజాగా ఈ ఉత్తర్వులు వెలువడడం విశేషం. సుబ్బారావు కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచీ అన్నవరం ఈవోగా వచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే రెవెన్యూ శాఖ నుంచి రిలీవ్ కావడం ఆలస్యమైంది. ప్రభుత్వం 64 మంది డిప్యూటీ కలెక్టర్ల పోస్టింగ్ ఉత్తర్వుల్లో అవకాశం దక్కించుకున్నారు. అమావాస్య వెళ్లిన తర్వాత నూతన ఈవో బాధ్యతలు స్వీకరిస్తారని దేవస్థానం వర్గాలు వెల్లడించాయి.

వనదుర్గ ఆలయంలో చండీ హోమం

అన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీ హోమం ఘనంగా జరిగింది. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తశతి పారాయణలు, మూలమంత్ర జపాలు పఠించారు. 11 గంటలకు హోమ గుండంలో సుగంధ ద్రవ్యాలు అర్పించి పూర్ణాహుతి గావించారు.

రేపు కాకినాడ సాగర తీరంలో మహా కుంభాభిషేకం



కాకినాడ సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగర తీరంలో మంగళాంబికా సమేత ఆదికుంభేశ్వరస్వామి 49వ మహా కుంభాభిషేకాన్ని ఆదివారం కార్తీక అమావ్యాస రోజున నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. రెండు రోజులుగా ఆలయ పరిసర ప్రాంతాలను ముస్తాబు చేయించి మహా శివలింగం ఆకారంలో కోటి శివలింగాలను అమర్చారు. శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు తాతయ్యనాయుడు, తోట పుండరీకాక్షయ్య (బాబి), చిట్నీడి శ్రీనివాస్, గంగాపాత్రుని శ్రీనివాసు మాట్లాడుతూ మహా కుంభాభిషేకంలో పాల్గొనేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం స్నానఘట్టం ఏర్పాటు చేయించామని తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.



మహా కుంభాభిషేకం వివరాలు వెల్లడిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పంచారామ క్షేత్రాల్లో హైకోర్టు న్యాయమూర్తి పూజలు



సామర్లకోటలో న్యాయమూర్తి సుజాతకి స్వామి, అమ్మవార్ల చిత్రపటం ఇస్తున్న ఈవో

సామర్లకోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు జడ్జి వి.సుజాత కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం కుమార రామ భీమేశ్వరాలయానికి విచ్చేశారు. ఆమెకు ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సాదర స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామికి అభిషేకాలు, బాలాత్రిపురసుందరి అమ్మవారికి పుష్పార్చన జరిపారు. పండితులు ఆమెకు నంది మండపం వద్ద వేదాశీర్వచనం ఇవ్వగా ఈవో నీలకంఠం శేష వస్త్రాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటం అందజేశారు. ధ్వజస్తంభం వద్ద దీపం వెలిగించారు. న్యాయమూర్తి వెంట డిప్యూటీ తహసీల్దారు వై.శ్రీనివాస్, సీఐ శ్రీకృష్ణభగవాన్, వీఆర్వోలు నలజర్ల మురళీకృష్ణ, నూతలపాటి లోవరాజు, ఆలయ సిబ్బంది వున్నారు.

ద్రాక్షారామ (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శుక్రవారం విచ్చేశారు. భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు దర్శనానంతరం బేడా మండపంలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వర్

విమానాశ్రయ విస్తరణ పనుల్లో పురోగతి

కోరుకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మధురపూడి విమానాశ్రయ విస్తరణ పనులు షెడ్యూలుకు అనుగుణంగా పురోగతిలో ఉన్నాయని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎయిర్‌పోర్టు అథారిటీ డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం నైపుణ్యాభివృద్ధి, ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ శాఖల ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ అమరావతి నుంచి విమానాశ్రయ పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూ సేకరణకు చెందిన మ్యుటేషన్ పూర్తికాగా ఐదు ఎకరాలకు సంబంధించిన పనులు ఈ వారంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రెండు కోర్టు కేసులు పెండింగులో ఉన్నాయన్నారు. వ్యవసాయ క్షేత్రాలకు అనుసంధానం, రహదారి మార్గం కూడా పరిష్కరించాల్సి ఉందన్నారు. ఆర్థికపరమైన అంశాల నేపథ్యంలో వాటి పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్టు అథారిటీ డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వర్, డీజీఎం శ్రీనివాసులు పనుల పురోగతిపై వివరాలు తెలిపారు. రూ.173.28 కోట్లతో చేపట్టనున్న పనుల్లో ఆర్‌బీసీ పనులు 99శాతం పూర్తయ్యాయని, మాన్సన్ పనులు 25శాతం, మాగ్రికేషన్ పనులు 20 శాతం పూర్తి చేశామన్నారు. 2025 ఆగస్టు 11 నాటికి పనులన్నీ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.



దాతలకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న దృశ్యం

అన్నదాన భవన నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

ఆత్రేయపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కొవ్వూరి శివశంకరరెడ్డి -పద్మ దంపతులు రూ.5.01 లక్షలు విరాళం సమర్పించారు. దాతలకు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందజేశారు. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. క్షేత్ర పాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో మహిళలు దీపాలంకరణ జరిపారు. అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవలద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,03,235 లభించినట్టు ఈవో సూర్యచక్రధరరావు చెప్పారు.

సత్యదేవుని సన్నిధిలో సహస్ర జ్యోతిర్లింగార్చన

అన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుని సన్నిదిలో కార్తీక బహుళ త్రయోదశిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి అనివేటి మండపంలో జ్యోతిర్లింగార్చన వైభవంగా జరిగింది. ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు శివలింగాకారంలో జ్యోతులను అలంకరించగా రుత్వికులు వెలిగించారు.



కొంగలు.. కనువిందు



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఇప్పనపాడులో పంట పొలాలు దమ్ము చేస్తున్న వేళ కొంగలు సందడి చేసిన దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది. -మండపేట

బిక్కవోలులో అంతర జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న బిక్కవోలు ఎస్ఐ, ఆడుతున్న శ్రీకాకుళం-పశ్చిమ గోదావరి జట్లు

బిక్కవోలు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గెలుపు, ఓటములను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలని బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ క్రీడాకారులకు సూచించారు. అంతర జిల్లాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలను తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు జడ్పీ హైస్కూల్ ప్లస్ పాఠశాలలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముందుగా జాతీయ పతాకాన్ని, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. బిక్కవోలులో బాల్ బ్యాడ్మింటన్ క్రీడను ప్రోత్సహించి ఎంతోమంది జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేసి ఉద్యోగవకాశాలు కల్పించిన జాతీయ క్రీడాకారుడు మానుకొండ వీర్రాఘవరెడ్డి సేవలను ఎస్ఐ కొనియాడారు. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి వచ్చిన బాలికా క్రీడాకారుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.వీరప్రభాకరరావు, పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి స్వామి, జిల్లా డీఎస్‌డీవో శేషగిరిరావు, స్టేట్ అబ్జర్వర్ రజనీదేవి, పీడీల అసోషియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, అనపర్తి జోన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి రాఘవరెడ్డి, పీడీలు బంగార్రాజు, ధనరాజు, యువరాజారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి, అప్పారెడ్డి, ప్రభాకరరెడ్డి, జావేద్, వీకేఆర్ తంబి పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన శ్రీకాకుళం, గుంటూరు జట్లు

రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి జట్లు పాల్గొన్నాయి. మొత్తం జట్లను నాలుగు పూల్స్‌గా విడదీయగా శుక్రవారం జరిగి పోటీల్లో పూల్ ఏ నుంచి శ్రీకాకుళం జట్టు పశ్చిమ గోదావరిపై గెలుపొంది సెమీస్‌కు చేరింది. పూల్ సీ నుంచి గుంటూరు జట్టు కర్నూలుపై గెలిచి సెమీస్‌కు చేరుకుంది. వెలుతురు లేమి కారణంగా క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన ప్రథమ, ద్వితీయ జట్లు పూల్ బిలో విజయనగరం-తూర్పుగోదావరి, పూల్ డిలో విశాఖ-ప్రకాశం జట్ల మధ్య జరగవలసిన సెమీ ఫైనల్ పోటీలు శనివారానికి వాయిదా వేశామని, ఈ పోటీలతో పాటు సెమీస్, ఫైనల్స్ నిర్వహించి పోటీలు ముగిస్తామని జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి స్వామి తెలిపారు.

లోడు లారీల బీభత్సం

- బండ రాళ్ల లారీని ఢీకొన్న ఐరన్ లోడు లారీ
- హైవేపై పడ్డ బండరాళ్లు
- నిలిచిన వాహనాల రాకపోకలు
- తప్పిన పెను ప్రమాదం



రాజానగరం-కలవచర్ల జంక్షన్‌లో రోడ్డుపై పడ్డ బండరాళ్లు



ప్రమాద స్థలంలో లారీలు

రాజానగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రాజానగరం-కలవచర్ల జంక్షన్‌లో శుక్రవారం రాత్రి గ్రానైట్ బండరాళ్ల లోడుతో వెళ్తున్న లారీని ఐరన్ లోడుతో వస్తున్న మరో లారీ ఢీకొంది. స్థానికుల వివరాలు ప్రకారం.. రాజమహేంద్రవరం వైపు నుంచి కాకినాడ పోర్టుకు మూడు బండరాళ్లతో వెళ్తున్న ట్రాలీ లారీ మార్గమధ్యలో రాజానగరం హైస్కూల్ సమీపంలో ఏడీబీ రోడ్డు వైపుగా మలుపు తిరుగుతోంది. ఈ సమయంలో వైజాగ్ నుంచి ఐరన్ ఊచల లోడుతో రాజమహేంద్రవరం వైపుగా వస్తున్న లారీ.. బండ రాళ్లతో మలుపు తిరుగుతున్న లారీని ఢీకొంది. దీంతో ట్రాలీపై ఉన్న 3 గ్రానైట్ బండ రాళ్లలో 2రాళ్లు హైవేపై పడిపోయి హైవేపై వాహనాలు రాకపోకలు నిలిచి పోయాయి. ఈ ప్రమాదంలో ఐరన్ ఊచల లోడు లారీ డ్రైవర్‌కు గాయాలు కావడంతో ఆటోలో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రాజానగరం ఎస్ఐ నాగార్జున సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే దిశగా చర్యలు చేపడుతున్నారు. కాగా ప్రమాదం జరిగిన సమయంలో ఏవిధమైన వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఒకవేళ ఆ బండ రాళ్లు ఏ వాహనం పడినా ఈ పాటికి ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోయే పరిస్థితులు ఈ ప్రాంతంలో ఉండేవనే చెప్పాలి.

లారీలతో రహదారులు ఛిద్రం..

నిబంధనలకు విరుద్ధంగా పరిమితి, పరిమాణానికి మించి భారీ బండ రాళ్లతో నిత్యం ఈ మార్గంలో లారీలు వెళ్లడం వల్ల రహదారులు కొంతకాలానికే ఛిద్రంగా మారుతున్నాయి. ఈ భారీ బండ రాళ్ల లారీల తాకిడి వల్లే ఏడీబీ రహదారి దారుణంగా తయారైంది.

నేమాంలో మాక్ డ్రిల్

గెయిల్ ఆధ్వర్యంలో నిర్వహణ



మాక్ డ్రిల్‌లో భాగంగా గ్యాస్ లీకేజీ ఘటనలో అస్వస్థతకు గురైన రైతులను అంబులెన్స్‌లోకి తరలిస్తున్న దృశ్యం



పైపులైన్ నుంచి లీకవుతున్న గ్యాస్‌ని అదుపులోకి తీసుకువస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సర్పవరం జంక్షన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సముద్రతీర ప్రాంతం నేమాం జగన్మోహనపురంలో శుక్రవారం గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్) సంస్థ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. గెయిల్ సంస్థ జీఎం వై.ఏకుమార్ ఆధ్వర్యంలో ఓఎన్‌జీసీ, వేదాంత, కెయిర్న్‌ల సంయుక్త భాగస్వామ్యంలో ఆఫ్ సైట్ మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ లీకేజీ జరిగినప్పుడు, జరుగుతున్న సమయం, తర్వాత తీసుకునే నివారణ, సహాయక చర్యలపై సిబ్బంది ప్రదర్శనాత్మకంగా విన్యాసాలు నిర్వహించారు. గ్యాస్ లీకేజీ జరిగిన వెంటనే కంట్రోల్ రూమ్‌కి సమాచారం, అక్కడ నుంచి విపత్తు నివారణ కోసం పనిచేసే యంత్రాంగం, స్విబందికి సమాచారం వెళ్లడం, నివారణ చర్యలను సిబ్బంది విన్యాసం చేసి చూపించారు. ఈ సందర్భంగా జీఎం వైపే కుమార్ మాట్లాడుతూ గ్యాస్ లీకేజీపై ప్రజలను అప్రమత్తం చేయడం, విపత్తుల నివారణ కోసం పునశ్చరణ కార్యక్రమం ఆఫ్ సైట్ మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు. నెలకోసారి ఆన్ సైట్‌లో సేఫిటీ భద్రత, ప్రమాదాల నివారణ కోసం తీసుకునే చర్యలపై డ్రిల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ సర్పంచ్ రాందేవు చిన్న, అగ్నిమాపక కేంద్రం అధికారి టీవీఎస్ రాజేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్, ఏడీఎఫ్‌వో సుబ్బారావు, ఎంపీడీపీ పసుపులేటి సతీష్, తహశీల్దార్ వీఎల్ఎన్ కుమారి, ఈవోపీఆర్‌డీ శ్రీరామ ఆంజనేయులు, రిజర్వు డీఎస్పీ తదితరులు పాల్గొనారు.

ప్రాణం తీసిన ఈత సరదా

చెరువులో మునిగి విద్యార్థి మృతి



మరణించిన జ్యోతిప్రకాష్

నల్లజర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈత సరదా విద్యార్థి ప్రాణం తీసింది. స్థానికుల వివరాల ప్రకారం.. తుర్పుగోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన గుడిసే మణికంఠ కుమారుడు జ్యోతిప్రకాష్(15) స్థానిక జడ్పీ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. తన స్నేహితులైన జంపెల్లి రాజేశ్(10వ తరగతి), ములపర్తి హేమంత్‌కుమార్(7వ తరగతి), తాడి యువరాజ్(9వ తరగతి)లతో కలిసి శుక్రవారం స్కూల్ మానివేసి హెచ్‌పీ గ్యాస్ గోడౌన్స్ వద్ద ఉన్న పేరంటాల గుంట చెరువులో సరదగా ఈత కొట్టడానికి వెళ్లారు. స్నానం చేస్తుండగా ప్రకాష్ ఊబిలో దిగిపోవడంతో స్నేహితులు లాగే ప్రయత్నం చేశారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో అక్కడకు చేరుకున్న స్థానికులు బయటకు తీసుకుని వచ్చి గ్రామంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ప్రకాష్ మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. స్కూల్‌కి వెళ్తున్నానని చెప్పి విగతజీవిగా మారిన కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

జీజీహెచ్‌లో రక్తం గ్రూపు మార్చేసిన వివాదంపై విచారణ

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో ఒక గ్రూపునకు బదులు మరో గ్రూపు రక్తం ఎక్కించి ఓ మహిళ మృతికి కారణమైన కేసులో బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు శుక్రవారం విచారణ ప్రారంభమైంది. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం వలమారు గ్రామానికి చెందిన బావన శిరీష(34) అనారోగ్యంతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఈనెల 26న ఆమెకు డయాలసిస్ చేసిన అనం తరం రక్తం ఎక్కించగా అది ఓపాజిటివ్ కాకుండా ఏబీ పాజిటివ్ ఎక్కించడంతో ఆ రోగి బిగుసుకుపోయి మృతిచెందిన విష యం తెలిసిందే. అనంతరం కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాలతో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి విచారణ కమిటీని నియమించారు. కమిటీ చైర్మన్‌గా మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ రామరాజు, సభ్యులుగా ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ సత్యవేణి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ కోనాల అనిత ఉన్నారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఈ కమిటీ విచారణ చేపట్టింది. ఏఎంసీయు-2లో శిరీష మృతిచెందిన సమయంలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు, వైద్యవిద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది నుంచి కమిటీ వివరాలు సేకరించింది. విచారణ కమిటీ నివేదికను శుక్రవారం రాత్రి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారికి అందజేసింది.

దుర్గాడలో ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఉన్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మా సశివరాత్రి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు, 21 రకాల ద్రవ్యాలు, 11 రకాల రుద్రాలతో స్వామికి అభిషేకం నిర్వహించారు.



ప్రత్యేక అలంకారంలో రామలింగేశ్వరస్వామి

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు 30మంది ఎంపిక

పిఠాపురంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ పోటీలు



ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పిఠాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు 30మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం ఆవరణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్చరీ జట్ల ఎంపికకు శుక్రవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన 30మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని, వారు విజయవాడలో డిసెంబరు 3నుంచి 5వ తేదీ వరకూ జరిగే రాష్ట్రస్థాయి సీనియర్స్ ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఎస్ఎస్ గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావు తెలిపారు. పోటీల్లో విజేతలు, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనవారికి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ బహుమతులు అందజేశారు. అంతకు ముందు పోటీలను జనసేన నేతలు జోగా వెంకటరమణ, మార్నీడి రంగబాబు, సతీష్ ప్రారంభించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా జి.శివప్రసాద్, కె.చిన్నబ్బాయి, బి.కృష్ణార్జున వ్యవహరించారు.

కొనసాగుతున్న సాఫ్ట్‌బాల్ పోటీలు

సెమీస్‌కి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు



కాకినాడ డీఎస్ఏలో సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కాకినాడ రూరల్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు శుక్రవారం కూడా కొనసాగాయి. మొదటి క్వార్టర్ ఫైనల్ పోటీలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు అనంతపురం జిల్లా జట్టుపై 8-4 స్కోర్ తేడాతో గెలిచి సెమీస్‌కి చేరినట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. అదేవిధంగా మరొక క్వార్టర్ ఫైనల్ పోటీలో శ్రీకాకుళం జిల్లా జట్టు నెల్లూరు జిల్లా జట్టుపై 11-6 స్కోర్ తేడాతోనూ, విజయనగరం జిల్లా జట్టు గుంటూరు జిల్లా జట్టుపై 3-1స్కోర్ తేడాతో, కడప ప్రకాశం జిల్లా జట్టుపై 10-2 స్కోర్ తేడాతోనూ గెలిచి సెమీస్‌కి చేరాయన్నారు. పోటీలను తూర్పుగోదావరి జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘ కార్యదర్శి ఏఎన్ రాంప్రసాద్, పరిశీలకులు ఈశ్వరరావు, పీఈటీ సంఘ అధ్యక్ష కార్యదర్శులు రవిరాజు, నూకరాజు పర్యవేక్షించారు.

ఆటో బోల్తా పడి ఆరుగురికి తీవ్రగాయాలు



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం



చిన్నింపేట జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొన్న ఆటో

ఏలేశ్వరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల పరిశ్రమకు చెందిన కార్మికులకు తీవ్రగా యాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం కార్మికులు ఫ్యాక్టరీ వద్ద తమ సమస్యలపై ధర్నా చేసి అక్కడి నుంచి పెద్దనాపల్లికి గ్రామానికి ఆటోలో బయలుదేరారు. 13మంది ప్రయాణిస్తున్న ఆటో జాతీయ రహదారిపై డివైడర్‌ను బలంగా ఢీకొని బోల్తా పడింది. దీంతో ఆరుగురు మహిళలకు తీవ్రగాయాలు అయ్యాయి. కుప్పల దేవి(29), కీర్తి రత్న కుమారిరి (30), కీర్తి నాగమణి(45), బుద్దా రాణి(40), శరకణం భూలక్ష్మి(45),శరకణం జగ్గుబాను(48)కు గాయాలు పాలవ్వడంతో వారిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

తునిలో మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్



మతిస్థిమితం లేని యువకుడిని తండ్రికి అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

తుని రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్‌లో మతిస్థిమితం లేని 25ఏళ్ల వ్యక్తి హల్‌చల్ చేసి భయభ్రాంతులకు గురిచేశాడు. స్టేషన్ మాస్టర్ రూమ్‌లోకి ప్రవేశించడంతో స్టేషన్‌మాస్టర్ పోలీసులకు ఫిర్యాదు అందించారు. దీంతో రైల్వే పోలీసులు ఆ యువకుడి గురించి ఆరా తీశారు. సంబంధిత వ్యక్తి చెన్నై-హౌరా ఎక్స్‌ప్రెస్ నుంచి తునిలో దిగినట్లు కనుగొన్నారు. ఆ యువకుడి పేరు షేక్ రిఫన్‌గా తెలుసుకుని వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వెస్ట్‌బెంగాల్‌కు చెందిన యువకుడి తల్లిదండ్రులను రప్పించి రిఫన్‌ను అప్పగించారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

రావులపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును ఆటోలో మర్చిపోయిన ఆ డ్రైవర్ నిజాయితీతో పోలీసుల ద్వారా బాధితులకు అందచేసి నిజాయితీ చాటుకున్నాడు. డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ఉచ్చిలికి చెందిన మానేపల్లి పుష్పవతి బంధువుల ఇంటికి వెళ్లేందుకు ఉచ్చిలిలో ఆటో ఎక్కారు. ఆమె రావులపాలెంలో ఆటోలోనే బ్యాగుమర్చిపోయి దిగివెళ్లిపోయారు. అనంతరం ఆటోలో బ్యాగును గుర్తించిన ఆటో డ్రైవర్ మండేలా శివన్నారాయణ స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అప్పగించి వివరాలు చెప్పాడు. పోలీసులు ఆ బ్యాగును తెరిచి చూడగా బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆమెను ఫోన్ ద్వారా స్టేషన్‌కు పిలిపించి సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ చంటి సిబ్బంది ఆమెకు బ్యాగును అప్పగించారు. ఆ బంగారు ఆభరణాల విలువ రూ.5లక్షలు ఉంటుందని నిజాయితీతో తన బ్యాగును తిరిగి అప్పగించినందుకు ఆటోడ్రైవర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నిజాయితీని చాటుకున్న శివన్నారాయణను సీఐ శేఖర్‌బాబు అభినందించారు.



రావులపాలెం పోలీస్‌స్టేషన్‌లో బ్యాగును పోలీసుల సమక్షంలో బాధితులకు అందిస్తున్న ఆటోడ్రైవర్

విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి తోడ్పాటు

తిరుపతి ఐఐటీ టెక్నాలజీ ఇంక్యుబేషన్ హబ్ ప్రాజెక్టు డైరెక్టర్ రోషన్ శ్రీవాత్సవ్



బూట్ క్యాంప్‌నకు హాజరైన శ్రీవాత్సవ్, ప్రముఖులు, పాఠశాలల ఉపాధ్యాయులు

రాజానగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ గ్రామీణ విద్యార్థులకు సృజనాత్మకతతో కొత్త ఆవిష్కరణలకు అవసరమైన నైపుణ్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని తిరుపతి ఐఐటీలోని టెక్నాలజీ ఇంక్యుబేషన్ హబ్ ప్రాజెక్టు డైరెక్టర్ రోషన్ శ్రీవాత్సవ్ అన్నారు. గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ (జీజీయూ)లోని ఐసీటీ సౌజన్యంతో ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఐడీఈ)బూట్ క్యాంప్ శుక్రవారం ప్రారంభమైంది. జీజీయూ కులపతి కేవీవీ సత్యనారా యణరాజు (చైతన్యరాజు) అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవసభలో ముఖ్య అతిథిగా హాజరైన శ్రీవాత్సవ్ మాట్లాడుతూ జీజీయూ అనుసంధానంతో విద్య జీఐఎస్ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించేందుకు చేయూతనిస్తా మన్నారు. మరో అతిథి ఐపీ అండ్ టెక్నాలజీ ట్రాన్స్ఫర్ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్‌సెల్, (ఏఐసీటీఈ) మేనేజర్ ఐఎన్ భీమలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో బాల్య దశ నుంచి సృజనాత్మకతను పెం పొందించే దిశగా పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రెండు దశల్లో శిక్షణ జరిపామని, ప్రస్తుతం మూడో దశ శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. వాద్వానీ ఫౌండేషన్ ప్రతినిధి విశాల్ నాయర్ మాట్లాడుతూ దేశంలోని మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉపాధ్యాయుల ద్వారా శిక్షణ అందించడం తమ ఫౌండేషన్ ముఖ్యోద్దేశ్యమన్నారు. బూట్ క్యాంప్ నోడల్ అధికారి టి.జయానందకుమార్ మాట్లాడుతూ 2 రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాలతో పాటుగా మహారాష్ట్ర, చత్తీష్‌ఘడ్, ఒరిస్సా, తమిళనాడు రాష్ట్రాల నుంచి 271 మంది ఉపాధ్యాయులు హాజరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో జీజీయూ వీసీ యు.చంద్రశేఖర్, డైరెక్టర్ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, దండమూడి విజేంద్రకుమార్, కె.వినోద్‌వర్మ, పాల్గొన్నారు.

ఆలయం... అద్భుతం!

కాకినాడ జిల్లా సామర్లకోటలో కుమారరామ భీమేశ్వరాలయం వద్ద శుక్రవారం రాత్రి ఆలయ శిఖర భాగాన ఉన్న పసిడి కుండలను ముద్దాడేందుకు చందమామ వస్తుందా అనే రీతిలో కనిపించింది. ఈ అద్భుతమైన దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది. -సామర్లకోట



ఎన్ఏఎస్ సర్వేపై శిక్షణ

తాళ్లరేవు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై తాళ్లరేవు ఎంఈవో కోరింగ కైట్ విద్యార్థులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డిస్ట్రిక్ట్ లెవెల్ కోఆర్డినేటర్ ఎమ్. వెంకటరావు, రీసోర్స్ పర్సన్ ఎ.తేజశ్వరరావు శిక్షణ ఇచ్చారు. ఎంఈవోలు మంగాయమ్మ, ఉమా, సీఆర్‌పీలు రాజేంద్ర, మీరాసాహెబ్ పాల్గొన్నారు.

అధికారులు వేధిస్తున్నారు

మేము కొనుగోలు చేసుకున్న స్థలాలు ప్రభుత్వానివి అంటున్నారు

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు అగ్రహారం దళితుల మొర



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు సమస్యను వివరిస్తున్న అగ్రహారం దళితులు

పిఠాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కష్టపడి సంపాదించిన సొమ్ముతో కొనుగోలు చేసిన స్థలాలు ప్రభుత్వానికి చెందినవంటూ అధికారులు తమను వేధింపులకు గురిచేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని అగ్రహారం దళితులు విన్నవించారు. పిఠాపురం బైపాస్‌రోడ్డులోని అగ్రహారం ప్రాంతంలో స్థలాలు ఉన్న తమకు న్యాయం చేయాలని, అధికారుల వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేస్తూ సదరు స్థలాల వద్ద శుక్రవారం నిరసనకు దిగారు. అక్కడే ఆందోళన శిబిరం ఏర్పాటు చేశారు. అదే సమయంలో రాజమహేంద్రవరం నుంచి కత్తిపూడి మీదుగా కాకినాడ వెళ్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను బైపాస్‌రోడ్డులో వారు ఆపి తమ సమస్యను విన్నవించారు. 2001లో తాము పంటపొలాన్ని ఒక మహిళ వద్ద ఇళ్లస్థలాలుగా కొనుగోలు చేశామని తెలిపారు. 6నెలలుగా సచివాలయం, మున్సిపల్, రెవెన్యూ అధికారులు తమకు అవి ప్రభుత్వ స్థలాలు అని పేర్కొంటూ నోటీసులు ఇచ్చి వేధిస్తున్నారని, తాము గృహాలు నిర్మించుకునేందుకు ప్లానులు ఇవ్వడం లేదని వివరించారు. గృహాలు నిర్మించుకునే వారి నుంచి లంచాలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. అగ్రహారం ప్రాంతంలో 26ఎకరాల్లోని ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే వాటిపై పట్టించుకోకుండా తమనే వేధించడం ఏమిటని వారు ప్రశ్నించారు. తమకు న్యాయం చేయాలని పవన్‌కు విన్నవించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావును కలవాలని ఆయన సూచించారు. వివరాలు తెలుసుకుని సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

కేబుల్‌వైరుతో ప్రయాణికులకు ఇబ్బందులు



ఉప్పాడ కొత్తపల్లి రోడ్డులో పై నుంచి కిందకు పడిన కేబుల్ వైరు

కొత్తపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉప్పాడ కొత్తపల్లి ఆర్అండ్‌బీ రహదారి పక్కన వీవీఎస్ కల్యాణమండపం పెట్రోల్‌బంక్ వద్ద ప్రైవేటు ఆపరేటర్స్ ఏర్పాటు చేసిన కేబుల్‌వైరు కిందకు జారింది. కొత్తపల్లి నుంచి ఉప్పాడ వరకు ఏర్పాటుచేసే కేబుల్ వీవీఎస్ కళ్యాణ మడపం పెట్రోల్‌బంక్ మీదుగా వెళ్లింది. ఇటీవల వీస్తున్న ఈదురుగాలులకు కేబుల్ వైరు సగం కిందకు వచ్చింది. దీంతో రాత్రిపూట బంక్‌లో పెట్రోల్ పోయించుకుని వెళ్లే ప్రయాణికులకు తగిలి పడిపోతున్నారు. రాత్రిపూట సైకిళ్లపై వెళ్లే వారు చక్రాలకు కేబుల్‌వైరు తగులుకుని గాయాల పాలవుతున్నారు. కిందకు జారిన కేబుల్ వైరును సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

పక్కా గృహాల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సాయం

మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురంలో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో సొంతంగా స్థలాలు కలిగి ఉండి అర్హత కలిగిన వారికి పీఎంఏవై పథకం ద్వారా పక్కా గృహాల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.2.50లక్షలు ఆర్థిక సహాయం అందించనున్నదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందు నిమిత్తం అధికారులు సర్వే నిర్వహిస్తున్నారని చెప్పారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల పరిధిలోనే ప్రస్తుతం ఈ సర్వే జరుగుతున్నదని, సర్వే బృందాలకు అర్హులైన పేదలు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. 3, 4 నెలల్లో గృహాలు నిర్మించుకునేవారే ప్రస్తుతం పేర్లు ఇవ్వాలని చెప్పారు. పీఎంఏవై పథకంపై టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కొంతసమయం తీసుకుని గృహాలు నిర్మించుకోవాలని భావించేవారికి మరోమారు అవకాశం వస్తుందని, పార్టీలకతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. టీడీపీ నాయకులు నల్లా శ్రీనివాస్, కొరుప్రోలు శ్రీను, సకుమళ్ల గంగాధర్, నామా దొరబాబు, సోము సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

'విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రవేటీకరణను అడ్డుకుంటాం'



ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

పిఠాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల హక్కుగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రవేటీకరణకు అడ్డుకుంటామని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి ఖండవిల్లి లోవరాజు తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రవేటీకరణకు వ్యతిరేఖంగా స్టీల్ ప్లాంటు హక్కు-బహుజనుల హక్కు పేరుతో డిసెంబరు 1వ తేదీన స్టీల్‌ప్లాంటు వద్ద నిర్వహించే ధర్నాకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం పిఠాపురంలో జరిగిన కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు ఆవిష్కరించారు. లోవరాజు మాట్లాడుతూ ఈ ఉద్య మంలో అవసరమైతే బీఎస్పీ అధినేత మాయావతి పాల్గొంటారని తెలిపారు. అందరు సంఘటితంగా ప్రవేటీకరణ కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పలువురు బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

4న ప్రజాహక్కుల ర్యాలీ



కొడవలిలో ప్రచారం నిర్వహిస్తున్న లిబరేషన్ నాయకులు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో డిసెంబరు 4న ప్రజాహక్కుల ర్యాలీ సందర్భంగా నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లిబరేషన్ కార్యదర్శి కాకర రత్నకుమారి కోరారు. కొడవలి గ్రామంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కె.గంగరాజు, పిల్లా ప్రభుదాసు, నేతల రత్నరాజు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో చులకన అవుతున్నాం

సామర్లకోట కౌన్సిల్‌లో అధికారుల వైఖరిపై పలువురు కౌన్సిలర్లు ధ్వజం



ప్రశ్నిస్తున్న సీనియర్ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ

సామర్లకోట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీలో అధికారులు తీరు మారడంలేదు.. వార్డుల్లో సమస్యలు పరిష్కరించే తీరు మారదు. కనీసం నెలకొకసారి జరిపే కౌన్సిల్ సమావేశంలో చేర్చే అజెండాలోని అంశాలపైనా కనీస అవగాహన లేకపోవడం వల్ల క్షేత్రస్థాయిలో చులకన అవుతున్నాం. ఇలా ఎంతకాలం అంటూ సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్‌లో పలువురు కౌన్సిలర్లు అధికారుల వైఖరిపై తీవ్రంగా ధ్వజమెత్తారు. సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ జీ.అరుణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సీనియర్ కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వాటర్ వర్క్స్ పంప్‌హౌస్ వద్ద 60 హెచ్‌పీ సామర్థ్యం గల మోటార్లకు చెంది ప్యానెల్ బోర్డు ఏర్పాటులో రూ.4.89లక్షల మేర మంజూరు కోరడం పలు అనుమానాలకు దారితీస్తుందని ప్రశ్నించారు. ఎంత ఖర్చు పెట్టారో తెలియజేయాలని పట్టుబట్టారు. దీనిపై కమిషనర్ శ్రీవిద్య, సహాయ ఇంజనీరు నుంచి స్పష్టమైన సమాచారం ఇవ్వడంలో పూర్తిగా విఫలం అయ్యారు. దీంతో పూర్తి సమాచారం వివరాలు నమోదు చేసిన పత్రాలతో కౌన్సిల్ సమావేశానికి అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని వైస్‌చైర్మన్ జాన్‌మోజెస్ పేర్కొన్నారు. ఒక దశలో కార్యాలయంలోనే ఉండి కూడా సమావేశానికి గైర్హాజరు అయిన మున్సిపల్ డీఈ అధికారిణిని సమావేశానికి హాజరుకావాలని చైర్‌పర్సన్ అరుణ సిబ్బంది ద్వారా సమాచారం అందించినప్పటికీ తాను రానని నిర్మోహమాటంగా బదులివ్వడంతో డీఈపై చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ కమిషనర్‌ను ఆదేశించారు. రోజూ ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీరు పసరుగా నురగలతో వస్తుందని ఇందుకు గోదావరి ఎగువ ప్రాంతంలోని ఒక పరిశ్రమ నుంచికాలువలోకి విడుదల చేస్తున్న కలుషితజలాలే కారణమని సీనియర్ కో-ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు ఆరోపించారు. మరో సభ్యుడు కరణం రాజ్‌కుమార్ మాట్లాడుతూ మున్సిపాల్టీ నిర్వహణలో ఉండే ఫిల్టర్ ప్లాంట్‌లను కూడా సిబ్బంది సక్రమంగా తెరవడంలేదని ఆరోపించారు. దోమలసంతతి పెరిగి ప్రజల జ్వరాల బారిన పడుతున్నారని సీనియర్ కౌన్సిలర్ పితాని కృష్ణ తెలిపారు. మున్సిపల్ ఆదాయ వనరుల సమీకరణకు కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులకు సహకరించాలని కమిషనర్ శ్రీవిద్య కోరగా అందుకు సీనియర్ కౌన్సిలర్ నేతల హరిబాబు మాట్లాడుతూ ఆదాయ వనరుల సమీకరణకు గతంలో తాము చేసిన సూచనలు ఏమాత్రం పట్టించుకోకుండా నేడు సహకరించాలని కోరడం విడ్డూరంగాఉందని ఎద్దేవా చేశారు.

మొక్కుబడిగా గొల్లప్రోలు కౌన్సిల్ సమావేశం

5 నిమిషాల్లోనే ముగింపు



గొల్లప్రోలులో నగర పంచాయతీ సమావేశం

గొల్లప్రోలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉండడం, అజెండాలో అంశాలు లేకపోవడంతో సమావేశాన్ని కేవలం 5 నిమిషాల్లోనే ముగించేశారు. గొల్లప్రోలు నగరపంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన జరిగింది. సమావేశం అజెండాలో కేవలం నగరపంచాయతీకి సంబంధించి అందుబాటులో ఉన్న సాధారణ నిధులు, గ్రాంట్లు, ఖర్చుల వివరాలు తెలిపే ఒకే అంశాన్ని పొందుపరిచారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎటువంటి పరిపాలన, అభివృద్ధి పరమైన అంశాలను అజెండాలోకి తీసుకువచ్చే అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా సమావేశాన్ని ఆ ఒక్క అంశానికే పరిమితం చేయడం, 3వ వార్డు కౌన్సిలరు మినహా మిగిలిన ఎవ్వరు ఎటువంటి అంశాలను ప్రస్తావించకపోవడంతో 5 నిమిషాల్లోనే ముగిసింది. సమావేశానికి వచ్చినంత సేపు కూడా లేకుండా సభ్యులు వెనుతిరిగారు. పట్టణంలో ఉన్న సమస్యలను ప్రస్తావించే అవకాశం ఉన్నా సభ్యులు ఎవ్వరు ఆసక్తి చూపలేదు. తన వార్డులో అభివృద్ధి పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని 3వ వార్డు కౌన్సిలరు మైనం భవానీరాజా ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ ముగియగానే ప్రారంభిస్తామని ఏఈ ప్రభాకర్ తెలిపారు. సమావేశంలో నగరపంచాయతీ కమిషనరు రవికుమార్, వైస్‌చైర్మన్లు తెడ్లపు అలేఖ్య రాణి, గంధం నాగేశ్వరరావు తదితరులున్నారు.

నేడు పిఠాపురం కౌన్సిల్ సమావేశం

పిఠాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం జరుగుతుందని కమిషనరు కనకారావు తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్‌హాలులో చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాతో పాటు సభ్యులు ప్రస్తావించే అంశాలపై చర్చించడం జరుగుతుందని చెప్పారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

పెద్దాపురంలో కూడా...

పెద్దాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం కౌన్సిల్ సమావేశమందిరంలో శనివారం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్‌చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కౌన్సిలర్లు హాజరవుతారని తెలిపారు.

నేడు గొల్లప్రోలులో రుద్రసహిత చండీ హోమం

గొల్లప్రోలు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉమారామలింగేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం)లో శనివారం ఉదయం రుద్రసహిత చండీహోమం నిర్వహించనున్నారు. హోమాన్ని 108 మంది పుణ్యదంపతులు జరిపిస్తారు. అదేరోజు రాత్రి కోటివత్తుల దీపోత్సవం జరగనున్నది. ఈ ఉత్సవాలకు సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేశామని శివాలయం కమిటీ చైర్మన్ గొల్లపల్లి పెదబాబీ తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

2న విశ్వకర్మ ట్రైనర్ల ఎంపికకు ఇంటర్వ్యూలు

సర్పవరం జంక్షన్, నవంబరు 29, (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో భాగంగా సర్పవరం జంక్షన్‌లో ప్రధాన మంత్రి కౌశల్ కేంద్రంలో విశ్వకర్మ ట్రైనర్ల ఎంపిక కోసం డిసెంబరు 2వ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్టు మైత్రి వన్ సంస్థ డైరెక్టర్ అనిల్ తెలిపారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంలో శిక్షణ కోసం యువతీ, యువకుల ఎంపిక జరుగుతుందన్నారు. 25-40 ఏళ్ల వయోపరిమితితో ఇంటర్ ఆపైన విద్యార్హత కలిగిన వారంతా అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 3 రోజుల పాటు శిక్షణతో మూల్యాంకనం చేసిన అనంతరం రూ.15వేలు జీతం ఇస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులు జిల్లాలో కేటాయించిన పలు సెంటర్లలో పని చేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 7075704852, 7075904852లో సంప్రదించాలని కోరారు.

మరిడమ్మకు అర్చన

పెద్దాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో శుక్రవారం అర్చన నిర్వహించారు. దేవస్థానం ఏసీ కురం విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రసాదాలు ఇచ్చారు.

భీమేశ్వరాలయంలో విశేష కార్తీక పూజలు



సామర్లకోట కుమారరామభీమేశ్వరస్వామి, అమ్మవారు, పిఠాపురం: కుక్కుటేశ్వరస్వామికి లక్షపత్రిపూజ

సామర్లకోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని శుక్రవారం సామర్లకోట కుమారరామభీమేశ్వరాలయంలో విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున గోపూజ నిర్వహించారు. ఆలయ అధికా రుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న తదితరుల వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేకపూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచే గాక రాష్ట్రం నలుమూలల నుంచీ అధికసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. స్వామి,అమ్మవార్లను దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. శ్రీపాద రాజశేఖర ఘనాపాఠి నేతృత్వంలో కాకినాడకు చెందిన భాస్కరరెడ్డి దంపతులు ఆశీనులయ్యారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. సంఘ సభ్యులు నిర్వహించిన జ్యోతిర్లింగార్చన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో 800మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఆలయానికి విచ్చేసిన భక్తులకు సామర్లకోట లయన్స్ భీమేశ్వరా క్లబ్ సౌజన్యంతో చక్కెర పొంగలి, పులిహోర అల్పాహారం, వాటర్‌ప్యాకెట్లు పంపిణీ చేసారు. ఈసేవల్లో చిత్తులూరి రాజా, ఈదర ఈశ్వర్‌కుమార్, అమలకంటి శ్రీనివాసరావు, గుండు శంకరరావు, మద్దిరాల శివనాగకృష్ణ, మాజేటి కృష్ణ, మేకా శ్రీను, కర్రి ఆదినారాయణ రెడ్డి, కానుబోయిన విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుక్కుటేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

అమ్మవారికి కుంకుమార్చనలు

పిఠాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ క్షేత్రంలో త్రయోదశి, మాసశివరాత్రి సందర్భంగా శుక్రవారం విశేష పూజలు జరిగాయి. స్వయంభూ కుక్కుటేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన (లక్షపత్రిపూజ), ఆది శంకరాచార్య ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీదేవికి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠానికి అధిష్ఠాన దేవత యిన పురుహూతికాఅమ్మవార్లకు కుంకుమపూజలు నిర్వహించారు. పాదగయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో, తులసి చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. పూజా కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ పర్యవేక్షించారు.

మహా అన్నదానం

సామర్లకోట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణ పరిధిలో నీలమ్మ చెరువు గట్టుపై వేంచేసియున్న ఉమామార్కండేయ స్వామి ఆలయంలో స్వామివారి, అమ్మవారి దివ్యకల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణమహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం మధ్యాహ్నం కమిటీ ప్రతినిధులు నిర్వహించిన మహా అన్నదానంలో 3వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

హరిహర క్షేత్రంలో స్వామి కల్యాణం

ఆలయ ఆవరణలో అఖండ కోటి దీపారాధన

సామర్లకోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట హరిహరక్షేత్రం అన్నపూర్ణాసమేత రామలింగేశ్వరాలయంలో స్వామివారి, అమ్మవార్ల దివ్యకళ్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి వందలాది భక్తుల శివనామస్మరణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు పరమానందగిరి స్వామి ఆధ్వర్యంలో ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు అభిషేకపూజలు, లక్షపత్రి పూజలు, శాంతికరకళ్యాణ పూజలు నిర్వహించారు. తొలుత స్వామి,అమ్మవార్లను నూతన వస్త్రాలు, పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వందలాది భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో అఖండ కోటి దీపారాధన పూజలు నిర్వహించారు. రాత్రి 10 గంటల వరకు మహాన్నదానం నిర్వహించారు. 3వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా హౌసింగ్ పీడీ సత్యనారాయణ

సర్పవరం జంక్షన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని, సీఎం చంద్రబాబు పిలుపు మేరకు డిసెంబర్ రెండో వారంలో లక్ష గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలని జిల్లా హౌసింగ్ పీడీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం తిమ్మాపురం లేఅవుట్‌లో మండల హౌసింగ్ ఏఈ నాగభూషణరావు ఆధ్వర్యంలో హౌసింగ్ లబ్ధిదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. బేస్‌మెంట్, రూఫ్ లెవెల్, స్లాబ్ లెవెల్ నిర్మాణంలో ఉన్న ఇళ్లను ప్రభుత్వ సాయంతో సత్వరంగా నిర్మాణం పూర్తి చేయాలన్నారు. వచ్చే ఏడాది మార్చి 2025లోపు అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేసి ప్రభుత్వం ఇచ్చే రూ.1.80గ్రాంటుతో పాటు ఎస్‌హెచ్‌జీలు ఇచ్చే రూ.35వేలను పొందాలని కోరారు. ఇళ్ల నిర్మించుకోకపోతే ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే అవకాశం లేదన్నారు. 20టన్నుల ఇసుక ఉచితంగా ప్రభుత్వం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద మాదారపు తాతాజీ, హౌసింగ్ ఈఈ వై.శ్రీనివాస్, ఈవోపీఆర్డీ శ్రీరామాంజనేయులు, సీసీ ప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉమామహేశ్వరరావు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఘట్కా పోటీలకు కాకినాడ క్రీడాకారిణి



కాకినాడ రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల తిరుపతిలోని రేణిగుంటలో జరిగిన 68వ ఏపీఎస్‌జీఎఫ్ఐ నిర్వహించిన రాష్ట్రస్థాయి ఘట్కా పోటీల్లో కాకినాడకు చెందిన 8వ తరగతి క్రీడాకారిణి ఎం.కారుణ్యశ్రీ కాంస్య పతకం సాధించి జాతీయ స్థాయి ఘట్కా పోటీలకు ఎంపికైంది. ఆమె తండ్రి లోకేష్‌కు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం ఉంది. తండ్రి ప్రోత్సాహంతో ఆమె క్రీడలపై మక్కువ పెంచుకుంది. నాలుగేళ్ల నుంచి ఘట్కాలో శిక్షణ పొందుతూ అనేక పతకాలు సాధించింది. డిల్లీలో డిసెంబరు 17 నుంచి జరిగే జాతీయ స్థాయి ఘట్కా పోటీల్లో ఆమె పాల్గొంటుంది. ఆమెను ఉపాధ్యాయులు, కోచ్, తోటి క్రీడాకారులు అభినందించారు.

1న శెట్టిబలిజ కార్తీక వనసమారాధన

కాకినాడ సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కాకినాడలో వచ్చేనెల 1న జరగనున్న శెట్టిబలిజ కార్తీక వనసమారా ధనకు పెద్దసంఖ్యలో సంఘీయులు తరలిరావాలని శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, ఆహ్వాన కమిటీ ప్రతినిధులు పితాని నూకరాజు, గెద్దాడ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం కాకినాడ రామారావుపేటలోని శెట్టిబలిజ హాస్టల్ భవనంలో వారు విలేకరులతో మాట్లాడారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును సంఘ నాయకులు కలిసి ఆహ్వానం లేఖను అందజేశారు. సాంబ మూర్తి నగర్ రెవెన్యూకాలనీలోని శెట్టిబలిజ కమ్యూనిటీహాల్ స్థలంలో వనసమారాధన రాజకీయ పార్టీలకు అతీతంగా నిర్వహి స్తామన్నారు. సమావేశంలో నాయకులు అంగటి అంజిబాబు, సీహెచ్ భవన్నా రాయణ, పిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

సామర్లకోట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): 104వైద్య సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ 104 వైద్య సిబ్బంది శుక్రవారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు ఆయన స్వగృహంలో వినతి పత్రం అందజేశారు. 104ఉద్యోగుల వేతనాలు సకాలంలో చెల్లించాలని, 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈవోకు జీవో 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈసందర్భంగా కాకినాడ జిల్లా 104 యూనియన్ అధ్యక్షుడు పి.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఎం.త్రిమూర్తులు, మహిళా ఉపాధ్యక్షులు వి.ఇందుమతి, ఉద్యోగులు జీ.పాపారావు, ఎస్‌కే, ఖలీషా, వి.మహేశ్వరి, ఎస్‌కె.రేష్మాసుల్తానా, పి.గోవిందు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రకాలనీలో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, తహశీల్దార్

కాకినాడ సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కాకినాడ 12వ డివిజన్ పరిధి ఏఎంజీ స్కూల్ ఎదుట గల స్వర్ణాంధ్ర కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున పది పూరిళ్లు దగ్ధమయ్యాయి. 15కుటుంబాలకు చెందిన 60మంది నిరాశ్రయులయ్యారు. రూ.5లక్షల వరకు ఆస్తినష్టం ఏర్పడినట్టు అంచనా వేశారు. బాధితులు సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. డివిజన్ మాజీ కార్పొరేటర్ తుమ్మల సునీత రమేష్ టెంట్లు వేయించి బాధితులకు ఆశ్రయం కల్పించారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ ఆధ్వర్యంలో సాలిపేట ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు. కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.మల్లిబాబు, అర్బన్ తహశీల్దార్ వి.జితేంద్ర బాధితులతో మాట్లాడి ప్రమాద వివరాలు నమోదు చేసుకున్నారు. బాధితులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన ఏర్పాట్లు చేశారు. బాధితులకు పునరావాస సాయం అందించే విషయమై ఎమ్మెల్యే వనమాడి కొండబాబు రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చైతన్యంతోనే బాల్యవివాహాలకు అడ్డుకట్ట

తాళ్లరేవు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజల చైతన్యంతోనే బాల్యవివాహాలకు అడ్డుకట్టవేయవచ్చని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. శుక్రవారం తాళ్లరేవు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో కిషోర్ వికాసం శిక్షణా కార్యక్రమాన్ని సీడీపీవో మాధవి అధ్యక్షతన నిర్వహించారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు అన్నిశాఖల అధికారులతో ఎంపీడీవో ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సీహెచ్. వెంకటరావు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వశాఖల సమన్వయంతో బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో కోరింగ ఏఎస్ఐ సత్యనారాయణ, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్, ఎంఈవోలు మంగాయమ్మ, ఉమ, సూపర్‌వైజర్లు లలిత, నిబావని, సత్యనళిని, కార్యదర్శులు, మహిళా పోలీసులు, వీవోఏలు, అంగన్వాడీ వర్కర్లు, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

సామర్లకోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీకి ఎరువులు, పురుగు మందులు రైతులకు విక్రయించాలని, స్టాక్ రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించాలని కాకినాడ ఏడీఏ ఎం.రత్నప్రశాంతి దుకాణదారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి వరకూ సామర్లకోట మండలం, పట్టణంలో పలు ఎరువుల, పురుగు మందుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారుల బృందంతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఓంశాంతి ఫెర్టిలైజర్స్, లక్ష్మీనారాయణ ఎంటర్‌ప్రైజెస్ దుకాణాల స్టాక్ రిజిష్టర్ల నిర్వహణ సక్రమంగా ఉన్నదీ, లేనిదీ ఏడీఏ రత్నప్రశాంతి ఆధ్వర్యంలో వ్యవసాయాధికారుల బృందం పరిశీలించింది. పురుగు మందులను పరిశీలించి విశ్లేషణ కోసం కొన్ని మందులను అధికారులు తీసుకెళ్లారు. మండల వ్యవసాయాధికారి ఐ.సత్య, జిల్లా వ్యవ సాయాధికారి కార్యాలయ సాంకేతిక వ్యవసాయా ధికారులు ఏ.గాయత్రి, విజయలక్ష్మి, పద్మజారాణి దుకాణ యజమానులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల కార్తీక వనసమారాధన

రౌతులపూడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రౌతులపూడి గ్రామ శివారు మామిడి తోటలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కేదారశెట్టి నాగేశ్వరరావు అధ్వర్యంలో శుక్రవారం కార్తీక వనసమారాధనను వైభవంగా నిర్వహించారు. మండలం నలుమూలల నుంచి ఆర్యవైశ్యులు కుటుంబీకులతో కలిసి వచ్చి తులసి మొక్క వద్ద పూజలు చేశారు. ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



మహ్మద్ షరీఫ్‌ని సన్మానిస్తున్న ఆయుర్వేద నిపుణుడు జమాల్‌ఖాన్

'మైనార్టీలను ప్రభుత్వపరంగా ఆదుకోవాలి'

చింతూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్న మైనార్టీలను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని మైనార్టీ వ్యవహారాల రాష్ట్ర సలహాదారు మహ్మద్ షరీఫ్‌ని చింతూరు ఆయుర్వేద నిపుణుడు జమాల్‌ఖాన్ కోరారు. శుక్రవారం అమరావతిలో జరిగిన షరీఫ్ ప్రమాణస్వీకారోత్సవానికి జమాల్‌ఖాన్ హాజరయ్యారు. షరీఫ్‌ని సన్మానించి మైనార్టీల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ, పాలకొల్లు నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సిలార్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తక్ అహ్మద్, సుభానీ తదితరులు షరీఫ్‌ని కలిసిన వారిలో ఉన్నారు.



ఎటపాకలో ప్లాస్టిక్ నిషేధిద్దామని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అటవీ శాఖ అధికారులు

ప్లాస్టిక్‌ని నిషేధిద్దాం... పర్యావరణాన్ని కాపాడదాం

ఎటపాక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ని నిషేధిద్దామని, పర్యావరణాన్ని కాపాడదామని అటవీ అధికారులు నినాదాలు చేశారు. నెల్లిపాక రేంజ్ అధికారి పీవీవీ మూర్తి నేతృత్వంలో అటవీ అధికారులు, సిబ్బంది శుక్రవారం పురుషోత్తపట్నం సమీపంలోని సెయింటాన్స్ పాఠశాల పరిసర ప్రాంతాల్లో శ్రమదానం చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో అశ్వినికుమార్, ఎఫ్‌బీవోలు మూర్తి, శ్రీకాంత్, దుర్గ, స్థానికులు పాల్గొన్నారు.

కూనవరం (ఆంధ్రజ్యోతి): కూనవరం-చింతూరు అటవీ మార్గంలోని భగవాన్‌పురం, కూటూరు గ్రామాల్లో డీఎఫ్‌వో బబిత ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది శుక్రవారం శ్రమదానం చేశారు. చెత్తను తొలగించి పేరుకుపోయిన ప్లాస్టిక్ డబ్బాలను ఏరిపారేశారు. ఎఫ్‌ఆర్వో కరుణాకర్, అనిల్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



కూనవరంలో ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

'పీసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి'

దేవీపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో 1/70, పీసా చట్టాలను పటిష్టంగా అమలుపరచాలని కోరుతూ శుక్రవారం ఆదివాసీ జేఏసీ నాయకులు దేవీపట్నం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ మండలంలోని దేవారం గ్రామానికి చెందిన సర్వే నెం.114/2లో భూమి కోర్టులో కేసులో ఉండగా 1/70, పీసా చట్టాలకి విరుద్ధంగా పీసా గ్రామ సభ తీర్మానం, తహసీల్దారు అనుమతి లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారన్నారు. దీనికి స్పందించిన తహసీల్దారు మాట్లాడుతూ... ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, అక్రమ మట్టి తవ్వకాలను నిలుపుదల చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా తవ్వకాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామన్నారు. ఆదివాసీ జేఏసీ నాయకులు యలగాడ నాగేశ్వరరావు, కారం రామన్నదొర, కారం సురేష్‌బాబు, మద్దేటి అంజిరెడ్డి పాల్గొన్నారు.



తహసీల్దారుకి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

తేనెటీగల పెంపకంపై యువతకు అవగాహన

మోతుగూడెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీఆర్పీఎఫ్ 42వ బెటాలియన్ కమాండెంట్ సంతోష్‌కుమార్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్, డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్ ఆధ్వర్యంలో డొంకరాయి, పరిసర గ్రామాల ప్రజలకు, యువతకు తేనెటీగల పెంపకంపై అవగాహన కల్పించారు. ఉపాధి లేనివారికి, యువకులకు తేనెటీగల పెంపకం స్వయం ఉపాధి అవుతుందన్నారు.



యువకులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పైడిపుట్టలో కార్తీక వన భోజనాలు

వై.రామవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడిపుట్ట గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం వై.రామవరం గ్రామానికి చెందిన పలువురు భక్తులు కార్తీక వనసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో ప్రజలు అన్నప్రసాదం స్వీకరించారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

వై.రామవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్తేడు వీఆర్‌ఏ ఎరిపోతు మోహనరావు (53) గురువారం రాత్రి మృతి చెందారు. శుక్రవారం ఆయన అంత్యక్రియలను కుటుంబీకులు జరిపారు. వై.రామవరం తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌ఏగా పని చేస్తున్న మోహనరావు కొంత కాలంగా అనారోగ్యంతో వున్నారు. ఆయన కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.20వేలు ఇస్తున్నట్టు తహసీల్దారు వేణుగోపాల్ తెలిపారు. రెవెన్యూ సిబ్బంది సంతాపం తెలియజేశారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

సాగునీటి కాలువ అక్రమణలను తొలగించండి

అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

ప్రకృతి వ్యవసాయదారుడు నారాయణరావు

రౌతులపూడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువ అక్రమణతో పంట నష్టపోయానని బలరామపురం గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయదారుడు కందా నారాయణరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఎనిమిది పదుల వయసులో బలరామపురంలో మూడు ఎకరాల భూమిలో తొమ్మిదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడు తన పొలానికి వచ్చే సాగునీటి కాలువ అక్రమణ వల్ల నీరు అందక లక్ష రూపాయలు విలువైన పంటను కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. మల్లంపేట వేళ్లే రహదారిలో ఏలేరు వృధా నీళ్ల ద్వారా వ్యవసాయం చేస్తున్నానన్నారు. ఈ నీటితో తనతో పాటు చుట్టుపక్కల సుమారు 20 ఎకరాల్లో పంటలు పండించుకుంటున్నారు. అక్రమణలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి అక్రమణలు తొలగించి సాగునీరు అందించాలని రైతు కోరుతున్నాడు.



కప్పేసిన కాలువను చూపిస్తున్న నారాయణరావు



అరుణాచలేశ్వరునికి విశేష పూజలు

ప్రత్తిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లిలో అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామికి శుక్రవారం ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. విశేష అలంకరణ చేయగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి శివాలయాల్లో జరిగిన కార్తీక దీపోత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



రుద్ర యాగ క్రతువులో పాల్గొన్న నవీన్ దంపతులు

ఇర్రిపాకలో రుద్ర యాగం

జగ్గంపేట రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇర్రిపాక ఏలేరు నదీ తీరాన వేంచేసియున్న భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయాల వద్ద టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్-లక్ష్మీదేవి దంపతులు శుక్రవారం రుద్ర యాగం నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ-మణి దంపతులు హాజరై యాగంలో పాల్గొన్నారు. నవీన్ మాట్లాడుతూ శివకేశవుల కటాక్షంతో ఈ ప్రాంతమంతా సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కార్తీకమాసం అంతా మహా రుద్రాభిషేకం నిర్వహించినట్టు తెలిపారు. తోట సర్వారాయుడు-సునీత దంపతులు, చెక్కపల్లి అన్నపూర్ణమ్మ, మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, అడపా తాతాజీ, బొల్లంరెడ్డి రామకృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నెహ్రూకి జ్ఞాపిక అందజేస్తున్న నూకరాజు నాయుడు

'భజన కళాకారులను ఆదుకోవాలి'

ప్రత్తిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భజన కళాకారులను ఆదుకోవాలను ఆదుకోవాలని సంఘం జిల్లా కన్వీనర్, ధర్మవరం విజయదుర్గ నాట్యమండలి అధ్యక్షుడు సానా నూకరాజు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని కళాకారులతో ఇర్రిపాక వెళ్లి జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. జిల్లాలో వెయ్యికి పైగా భజన బృందాలున్నాయని, టీటీడీ మాదిరిగా అన్నవరం దేవస్థానంలో కూడా హరినామ సంకీర్తన, భజనలు ఏర్పాటు చేసి నిత్యం నాలుగైదు భజన బృందాలకు అవకాశం కల్పించాలన్నారు. భజన గురువులకు నెలసరి పారితోషకంగా రూ.10వేలు మంజూరు చేయించాలని కోరారు. ఎమ్మెల్యే నెహ్రూకు శాలువా కప్పి జ్ఞాపిక అందజేశారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ దళే సూరిబాబు, విశ్రాంత ఉద్యోగి వరుపుల రూపులయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

8న ఐలాజ్ రాష్ట్ర మహాసభ

ప్రత్తిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అన్నవరం శేషాద్రి సదన్‌లో వచ్చే నెల 8వ తేదీన జరిగే ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ రాష్ట్ర మొదటి మహాసభను విజయవంతం చేయాలని ఐలాజ్ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం వారు కోర్టు వద్ద సంబంధిత కరపత్రాలను విడుదల చేశారు. న్యాయవాది బుగతా శివ పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

గండేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బొర్రంపాలెంలో ఆయిల్‌పామ్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యానవన శాఖాధికారి పి.లావణ్య, సర్పంచ్ పోకల సుబ్బారావు, మాజీ సర్పంచ్ పల్లపు విష్ణుచక్రం, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.



కార్మికులకు అభివాదం చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

మాకు న్యాయం చేయండి

జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికుల నినాదాలు

ఏలేశ్వరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నింపేట వద్ద ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వాహనాన్ని ఆపి వినతిపత్రం ఇచ్చేందుకు జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు ప్రయత్నించారు. తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. దీంతో పోలీసులు మోహరించి వారిని అడ్డగించారు. పవన్‌కల్యాణ్ వాహనంపై నుంచే నమస్కారం చేస్తూ వెళ్లిపోయారు. ఆయన అనుచరులు కార్మికులు ఇచ్చిన వినతిపత్రం తీసుకున్నారు.

మెగా పీటీఎంను విజయవంతం చేయాలి

తొండంగి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 7వ తేదీన జరిగే మెగా పేరెంట్ టీచర్స్ సమావేశంపై శుక్రవారం విద్యా శాఖ కమిషనర్ కోన శశిధర్ విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులతో వెబెక్స్ సమావేశం నిర్వహించారు. పీటీఎం విజయవంతానికి తీసుకోవాల్సిన పలు అంశాలను విద్యా శాఖ కమిషనరు విజయరామరాజు, ఎస్పీడీ శ్రీనివాసరావు వివరించారు. ఎ.కొత్తపల్లి ఉన్నత పాఠశాల నుంచి మండల ప్రత్యేకాధికారి ప్రవీణ, ఎంపీడీవో రాజేశ్వరరావు, ఎంఈవోలు షేక్ బాబ్జీ, అనిశెట్టి సుబ్బిరెడ్డి హాజరయ్యారు.



సమావేశంలో పాల్గొన్న ప్రత్యేకాధికారి ప్రవీణ

అపార్ నమోదుపై సమీక్ష

ప్రత్తిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అపార్ నమోదుపై మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో కుమార్‌బాబు శుక్రవారం సమీక్షించారు. మండలంలో 14వేల మంది విద్యార్థుల అపార్ నమోదు జరగ్గా.. ఆధార్, పుట్టిన తేదీ, అక్షర దోషాల కారణంగా 2,165 మందివి పూర్తి కాలేదని, వెంటనే పూర్తి చేయాలని కోరారు. పాఠశాలల్లో డిసెంబరు 7న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులతో కలిసి అధికారులు మధ్యాహ్న భోజనం చేస్తారని వివరించారు.

జగ్గంపేటలో అన్నసమారాధన

జగ్గంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లపు వీధిలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 87వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా శుక్రవారం భారీ అన్నసమారాధన జరిపారు. సంఘ సభ్యుడు కొమ్మోజు సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుంకర పాపారావు, ముదపాక రమణ, నాగభూషణం, వరదా సురేష్, కొమ్మోజు శివకుమార్, వరదా ప్రసాద్, గాముగుల రఘు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ పండుదొర

గురబొక్క గ్రామంలో శ్రమదానం

రంపచోడవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురబొక్క గ్రామంలో సర్పంచ్ కొమరం పండుదొర అధ్వర్యంలో శుక్రవారం శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, డ్వాక్రా మహిళలు చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం సర్పంచ్ సమావేశం నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. నాటుసారా వల్ల కలిగే అనర్థాలను వివరించి, యువత మత్తు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'గెరిల్లా పోరాటాలను తీవ్రతరం చేద్దాం'

ఎటపాక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా పోరాటాలు, గెరిల్లా పోరాటాలను తీవ్రతరం చేసి ఆపరేషన్ కగార్‌ని తిప్పికొడదామని భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరిసీతారామరాజు జిల్లా కార్యదర్శి అజాద్ పేరిట శుక్రవారం విడుదలైన లేఖ సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. పీఎల్‌జీఏ ఏర్పడి డిసెంబరు 2 నాటికి 24 సంవత్సరాలు పూర్తయ్యిందని, వాడవాడలా పీఎల్‌జీఏ సమరోత్సవ కార్యక్రమాలు జరుపుకుందామని పిలుపునిచ్చారు.

'బాల్య వివాహాలతో అనర్థాలు'

ప్రత్తిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో అనేక అనర్థాలు ఎదురవుతాయని డిప్యూటీ కలెక్టర్, బీసీ కార్పొరేషన్ ఏడీ ఎ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే సమస్యలపై స్థానిక మినర్వా విద్యా సంస్థల ప్రాంగణంలో శుక్రవారం టెన్త్, ఇంటర్ విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల నిర్మూలనపై తోడ్పడతామని వారితో ఎంపీడీవో కుమార్‌బాబు ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవో వి. రాజబాబు, ఏపీఎం వెంకట్, ఏపీవో కుమారస్వామి, ప్రిన్సిపాల్ హరిబాబు, ఆనంద్‌జోష్‌కుమార్, వెలుగు సిబ్బంది రత్నం పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది సర్కిల్ పరిధిలోని పెదమల్లాపురంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి వినియోగించే 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సీఐ, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్వామీజీ

గోవుల పరిరక్షణకు 9న పాదయాత్ర

గండేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లూరు జియ్యన్న మఠంలో భారతీయ ధర్మ పరిషత్ కాకినాడ జిల్లా శాఖ అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్రచౌదరి ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, తాళ్లూరు మఠాధిపతి పొడుగు వెంకట సత్యనారాయణ ప్రసాదాచార్య స్వామీజీ మాట్లాడుతూ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శ్రీకృష్ణ చరణానంద భారతి స్వామి ఆదేశాలతో డిసెంబరు 9న జగ్గంపేట హైస్కూలు వద్ద గల సోమాలమ్మ తల్లి గుడి నుంచి కొంగల రావిచెట్టు వరకూ పాదయాత్ర నిర్వహిస్తామని చెప్పారు.



కొండబాబును సత్కరిస్తున్న దృశ్యం

కొండబాబుకు ఆర్యవైశ్యుల సత్కారం

జగ్గంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కొత్త కొండబాబును శుక్రవారం ఆయన స్వగృహంలో పలువురు సంఘీయులు కలిశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, ఉమ్మడి తూర్పు గోదావరి ఆర్యవైశ్య సంఘం వాణిజ్య విభాగం చైర్మన్ లక్కింశెట్టి బాబులు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అదనపు కార్యదర్శి కాసు శ్రీనివాస్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు సూరిబాబు తదితరులు కొండబాబును ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.



తాండవ లింగేశ్వరునికి లక్షపత్రి పూజ

తుని రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కత్రావుల కొండ వద్ద తాండవ లింగేశ్వరస్వామికి శుక్రవారం లక్షపత్రి పూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో శివ భక్తులు హాజరయ్యారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

వైభవంగా ఉమారామ లింగేశ్వరుని కల్యాణం

తొండంగి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపట్నం గ్రామంలో ఉమారామలింగేశ్వరుని కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్ఛారణలతో కల్యాణాన్ని అర్చకస్వాములు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులకు అన్నప్రసాదాలు అందించారు.

సీనియర్ కార్యకర్తకు యనమల పరామర్శ

తుని రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తొండంగికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త కొయ్యా సత్తిబాబు అనారోగ్యంతో కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం ఆయన్ను మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు పరామర్శించారు. ఆయన వెంట గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ఉన్నారు.

సారా బట్టీలపై దాడులు

తొండంగి/తుని రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తొండంగి మండలం అన్నయ్యపేట గ్రామంలో సారా బట్టీలపై తుని ఎక్సైజ్ ఎస్‌ఐ శాస్త్రి ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం దాడులు చేశారు. సుమారు 2,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్‌హెచ్‌వో వై.పట్టాభిచౌదరి తెలిపారు.